అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలి



కార్యకర్తలతో కార్పొరేటర్ సబిహాబేగం

మోతీనగర్: కార్యకర్తలకు, ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించడమే ప్రజా ప్రతినిధుల కర్తవ్యమని అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబిహా బేగం అన్నారు. మంగళవారం బీఆర్ఎస్ పార్టీ ఎస్సీ సెల్ అల్లాపూర్ డివిజన్ అధ్యక్షుడు జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్ పెద్దమ్మ గుడి ఆవరణలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పార్టీ అధికారంలో ఉన్నా, లేకున్నా కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. కార్యక్రమంలో మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహ్మద్ గౌసుద్దీన్, డివిజన్ అధ్యక్షుడు లింగాల ఐలయ్య, ప్రధాన కార్యదర్శి పిల్లి తిరుపతి, బీసీ సెల్ అధ్యక్షుడు నాగుల సత్యం గంగపుత్ర, నాయకులు సంజీవరెడ్డి, రాంరెడ్డి, యోగిరాజ్, మొగిలిరాజ్, కల్యాణ్‌నాయక్, మల్లేష్, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా 'పోచమ్మ తల్లి' వార్షికోత్సవాలు





విద్యుత్ అలంకరణలో ఆలయం



హోమం కోసం ఏర్పాట్లు

మూసాపేట: మూసాపేట భవానీనగర్‌లోని పోచమ్మ తల్లి ఆలయ 25వ వార్షికోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం 4 గంటలకు పోచమ్మ అమ్మవారి స్వాగత తోరణం నుంచి మంగళవాయిద్యాలతో, మంగళ హారతులతో పూజలు ప్రారంభించారు. గణపతి పూజ, పుణ్యాహవచనం, అంకురార్పణ, నవగ్రహ క్షేత్ర పాలిక మండపం, హోమం వంటి పూజలు నిర్వహించారు. రాత్రి కూచిపూడి నృత్య కళా ప్రదర్శన ఆకట్టుకుంది. 17వ తేదీ వరకు వేడుకలు నిర్వహించనున్నారు.

ఆలయ చరిత్ర

మూసాపేట గ్రామంలో సుమారు శతాబ్దాల క్రితం విష జ్వరాలు వ్యాపించకుండా, పాడి పంటలు సమృద్ధిగా పండేలా గ్రామ పెద్దలు పొలాల్లో పోచమ్మ తల్లిని ప్రతిష్ఠించి గ్రామ దేవతగా కొలిచారు. కాలక్రమంగా అమ్మవారు కొలువై ఉండటంతో అమ్మవారి పేరుతో భవానీ నగర్ కాలనీ ఏర్పడింది. 1999లో మూసాపేట గ్రామ పెద్దల సహకారంతో కాలనీ వాసులు ఆలయాన్ని నిర్మించి పోచమ్మ అమ్మవారిని ప్రతిష్ఠించారు. అమ్మవారికి తొలిపూజ చేసిన తరువాతే మిగతా ఆలయాలకు బోనాలను మొక్కులుగా చెల్లించడం ఇక్కడి ఆనవాయితీ. విష జ్వరాలు, రోగాలు వ్యాపించినా అమ్మవారిని వేడుకుంటే నయం అవుతుంది అని ఇక్కడి భక్తుల నమ్మకం. ఈ పోచమ్మ తల్లిని శీతలి మాతగా, చల్లని తల్లిగా పిలుస్తారు.

ప్రత్యేక పూజలు

బుధవారం ఉదయం 9 గంటలకు అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, చండీ హోమం, సాయంత్రం రుద్ర హోమం, లక్ష పుష్పార్చన, కుంకుమార్చన, హరినామ సంకీర్తన, ప్రవచనాలు, 17న ఉదయం 6 గంటలకు అమ్మవారికి అభిషేకం, 11:30 గంటలకు భ్రమరాంబిక మల్లికార్జున స్వామి కల్యాణం, అన్న సమారాధన, సాయంత్రం పార్వతీ కల్యాణం, బుర్ర కథ వంటి పూజా కార్యక్రమాలు ఉంటాయని కాలనీ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ తెలిపారు.

లక్కీ డ్రా విజేతలకు బహుమతులు అందజేత



అనిల్‌కు యాక్టివా అందజేస్తున్న యాదగిరి, అమూల్య

ఓల్డ్ బోయిన్‌పల్లి: హస్మత్‌పేట్ చౌరస్తాలోని దుర్గామాత అమ్మవారి మండపంలో టీపీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరి మంగళవారం కూరగాయల మార్కెట్లో భక్తుల సమక్షంలో లక్కీ డ్రాను నిర్వహించారు. ఈ లక్కీ డ్రా లో మొదటి బహుమతిగా తులం బంగారం చైన్ కూరగాయల మార్కెట్లో పని చేసే సుశాంత్‌కు రాగా, రెండో బహుమతిగా యాక్టివా అనిల్ అనే వ్యక్తికి వచ్చింది. మూడో బహుమతిగా సైకిల్ మార్కెట్‌లో పని చేసే మరో వ్యక్తికి రాగా మిగతా 18 వస్తువులలో మిక్సీలు, గ్రైండర్లు మిగతా వారికి డ్రాలో వచ్చాయి. వారికి టీపీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరి శాలువాలు కప్పి అందజేశారు. కార్యక్రమంలో కంటెస్టెడ్ కార్పొరేటర్ దండుగుల అమూల్య, మల్లికార్జున్ యాదవ్, దేవయ్య, ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

'ఉర్దూ' మధురమైన భాష

- హెచ్‌సీయూ వీసీ ప్రొఫెసర్ బీజేరావు
- 'మనూ'లో బీబీఎస్ ఉర్దూ ప్రాజెక్ట్ ప్రారంభం



మ్యాగజైన్‌ను ఆవిష్కరించిన వీసీలు ప్రొ.బీజేరావు, ప్రొ.సయ్యద్ ఐనుల్ హసన్

రాయదుర్గం: 'ఉర్దూ' మధురమైన భాష అని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు అభివర్ణించారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ), భారతీయ భాషా సమితి (బీబీఎస్) సంయుక్త ఆధ్వర్యంలో మనూలో బీబీఎస్ ఉర్దూ ప్రాజెక్టును ఆయన వీసీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్‌తో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉర్దూ రచయితల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.'మనూ వీసీ, బీబీఎస్ నోడల్ అధికారి ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ మాట్లాడుతూ విద్యార్థులను ఆకర్షించడానికి ప్రత్యక్ష విధానాన్ని అవలంబించాలని రచయితలకు ఆయన సూచించారు. ఏఎంయూ భాషాశాస్త్ర విభాగం ప్రొఫెసర్ ఇంతియాజ్ మాట్లాడుతూ ఎన్ఈపీ మాతృభాషలో విద్యను అందించడంలో ప్రాధాన్యత ఇస్తుందన్నారు.

బీబీఎస్ ఉర్దూ కార్యాలయం ప్రారంభించిన హెచ్‌సీయూ వీసీ బీజేరావు

ఉర్దూ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లోని డెక్కన్ స్టడీస్ సెంటర్ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన బీబీఎస్ ఉర్దూ కార్యాలయాన్ని హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు ప్రారంభించారు. అనంతరం యూనివర్సిటీ మ్యాగజైన్ 'అల్-కలామ్' ప్రత్యేక సంచికను కూడా విడుదల చేశారు. డీటీటీఎల్‌పీ కార్యకలాపాలు, విజయాలపై షార్ట్ వీడియోను ప్రదర్శించారు. కార్యక్రమానికి దేశం నలుమూలల నుంచి 60 మంది ఉర్దూ రచయితలు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ విద్యార్థి సంఘం ఎన్నికలు షురూ

2023-24 విద్యార్థి సంఘం రద్దు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో 2024-25 విద్యా సంవత్సరానికి విద్యార్థి సంఘం ఎన్నికలను నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఎన్నికల నిర్వహణకు హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు ఆమోదం తెలిపినట్లు తెలిసింది. దీంతో విద్యార్థి సంఘం ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధమైంది.



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్‌ను మంగళవారం వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. దసరా శుభాకాంక్షలు తెలిపారు. – ఆల్విన్‌కాలనీ

19న జిల్లా ఆస్పత్రిలో డాక్టర్లకు ఇంటర్వ్యూలు

గచ్చిబౌలి: కొండాపూర్ జిల్లా ఆస్పత్రిలో కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేసేందుకు డాక్టర్లకు ఈ నెల 19న వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్(డీసీహెచ్ఎస్)రంగారెడ్డి జిల్లా డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. 2025 మార్చి 30 వరకు పని చేసేందుకు స్పెషలిస్టులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. కొండాపూర్ జిల్లా ఆస్పత్రిలోని కాన్ఫరెన్స్ హాల్‌లో 19వ తేదీ ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో పాటు అటెస్టేషన్ చేసిన జిరాక్స్ కాపీలు వెంట తెచ్చుకోవాలని ఆయన సూచించారు. ఓబీజీ, జీఎం, జీఎస్, ఆర్థో, రేడియాలజీ, జీడీఎంఓ తదితర విభాగాలలో పని చేసేందుకు 20 మంది డాక్టర్లు అవసరమని రంగారెడ్డి జిల్లాలోని టీవీవీపీ ఆస్పత్రులలో పని చేయాల్సి ఉంటుందన్నారు.

ఓటరుగా నమోదు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో వార్డు మెంబర్ల సహకారంతో 18 ఏళ్లు నిండిన యువత కొత్తగా ఓటరు గుర్తింపు కార్డు నమోదు చేసుకునేలా పార్టీల ప్రతినిధులు చొరవ తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ వీసీ హాల్‌లో డీఆర్ఓ హరిప్రియతో కలిసి అదనపు కలెక్టర్ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో 18 ఏళ్లు నిండిన యువత శాతం ఎక్కువగా ఉన్నప్పటికీ, ఓటరు నమోదు శాతం పెరగడం లేదని అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. ఇందుకుగాను వార్డు మెంబర్ల భాగస్వామ్యంతో యువత కొత్తగా ఓటరు గుర్తింపు కార్డు నమోదు చేసుకునేలా చూడాలని పార్టీ ప్రతినిధులను కోరారు. జిల్లాలో ఓటరు నమోదు శాతాన్ని పెంచాలన్నారు. భారత ప్రభుత్వ ఎన్నికల కమిషన్ సూచనల మేరకు జిల్లాలో ఓటర్లకు అనుకూలంగా ఉండేలా 1500 మందికి ఒక పోలింగ్ బూతు ప్రకారం జిల్లాలో అదనంగా 38 పోలింగ్ బూతులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లాలో అదనంగా నియోజక వర్గాల వారీగా మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గంలో 21, మల్కాజిగిరిలో 7, కుత్బుల్లాపూర్‌లో 10 పోలింగ్ బూతులను ఏర్పాటు చేయడంతో ప్రస్తుతం జిల్లాలో 2,435 పోలింగ్ బూతులు ఉన్నాయన్నారు. ఓటర్లకు సమీపంగా, సౌకర్యవంతంగా ఉండేలా పరిశీలించి ఈ పోలింగ్ బూతులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అదనంగా ఏర్పాటు చేసిన పోలింగ్ బూతుల నెంబర్ల సవరింపులో కొన్ని బూతుల నెంబర్లు మారుతాయని, బూతు పోలింగ్ అధికారులు ఈ మార్పు పై ఓటర్లకు అవగాహన కల్పించాలని అదనపు కలెకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కీసర ఆర్డీఓ ఉపేందర్ రెడ్డి, ఎన్నికల విభాగం అధికారి రాజేశ్వర్ రెడ్డి, పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

'స్టడీ ఇన్ ఇండియా' యూనివర్సిటీ ఫెయిర్




కోర్సుల వివరాలు తెలుసుకుంటున్న విద్యార్థులు

శేరిలింగంపల్లి: స్టడీ ఇన్ ఇండియా యూనివర్సిటీ ఫెయిర్‌ను నల్లగండ్లలోని ఎపిస్టెమో వికాస్ లీడర్‌షిప్ స్కూల్‌లో మంగళవారం నిర్వహించారు. స్కూల్ కెరీర్ డిజైన్ ల్యాబ్ చొరవలో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 60 టాప్ ప్రైవేట్ యూనివర్సిటీలు పాల్గొన్నాయి. ముఖ్యంగా అశోక విశ్వవిద్యాలయం, మహీంద్రా, వీఐటీ, ఎస్ఆర్ఎం, శివ్ నాడార్, జీడీ గోయెంకా, క్రియా, అహ్మదాబాద్, ఇక్ఫాయ్, బిట్స్, క్రిస్ట్ యూనివర్సిటీ వంటివి పాల్గొన్నాయి. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొని ఆయా యూనివర్సిటీలలో అందించే కోర్సులు, అంతర్జాతీయ సహకారం, స్కాలర్‌షిప్‌లు, ఉన్నత విద్యాకోర్సుల వివరాలను తెలుసుకున్నారు. పాఠశాల ప్రిన్సిపల్ పద్మ కొల్లి, వైస్ ప్రిన్సిపల్ మర్రి వాణి లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో వివిధ యూనివర్సిటీల ప్రతినిధులు, పాఠశాల ఫ్యాకల్టీ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


పాఠశాలలో విద్యుత్ వైర్లు చోరీ

జీడిమెట్ల: ప్రభుత్వ పాఠశాలలో విద్యుత్ వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. ప్రభుత్వ పాఠశాలకు ఈ నెల 2వ తేదీ నుంచి దసరా సెలవులు ప్రకటించారు. దీంతో కుత్బుల్లాపూర్ గ్రామంలోని పాఠశాల సిబ్బంది తాళం వేసి వెళ్లారు. తిరిగి పాఠశాలలు మంగళవారం ప్రారంభం కావడంతో పాఠశాలకు వచ్చిన సిబ్బంది తాళాలు తీసి చూసే సరికి స్విచ్ బోర్డులు తొలగించి అందులో ఉన్న వైరును అపహరించినట్లు గమనించారు. పాఠశాలలో 12వ తేదీ రాత్రి దొంగతనం జరిగి ఉండవచ్చని ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ఈ విషయమై హెచ్ఎం మంగళవారం జీడిమెట్ల పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. గతంలో సైతం ఇదే విధంగా వైర్లను అపహరించారంటూ పీఎస్‌లో ఫిర్యాదు చేసినా దొంగలు దొరకలేదని హెచ్ఎం తెలిపారు.

అబ్దుల్ కలాం సేవలు మరువలేనివి



నివాళులర్పిస్తున్న అసోసియేషన్ నాయకులు, వాకర్స్



కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న శ్రీనివాస్ తదితరులు

మూసాపేట: కూకట్‌పల్లి నియోజకవర్గం భరత్ నగర్ కాలనీ గుడ్ మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పి. నాగిరెడ్డి, సీనియర్ సిటిజన్ అసోసియేషన్ అధ్యక్షుడు మాణిక్‌రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి భిక్షపతి, విజయ్‌కుమార్, బుచ్చిబాబు, శ్రీనివాస్‌రెడ్డి, నారాయణ, సుబ్బారెడ్డి, శివరాజ్ యాదవ్, నవీన్, శ్యామలాదేవి పాల్గొన్నారు.

పంచశీల స్కూల్‌లో..

మూసాపేట: పంచశీల స్కూల్‌లో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని నిర్వహించారు. ప్రముఖ విజ్ఞాన శాస్త్ర వేత్త, గొప్ప నాయకుడు కలాం జయంతిని ప్రతి సంవత్సరం ప్రపంచ విద్యార్థుల దినోత్సవంగా జరుపుకుంటామని తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ పంచశీల శ్రీనివాస్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రూప్-1 పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలి

జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాధికా గుప్తా

సాక్షి,సిటీబ్యూరో: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహిస్తున్న గ్రూప్-1 సర్వీసెస్ మెయిన్స్ రాత పరీక్షలకు విధులు నిర్వహిస్తున్న సంబంధిత అధికారులు అందరూ సమన్వయంతో పని చేసి, పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్)రాధికా గుప్తా అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో టీజీపీఎస్సీ గ్రూప్-1 రాత పరీక్ష పై ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో డీఆర్ఓ హరిప్రియతో కలిసి ఆమె మాట్లాడారు. చీఫ్ సూపరిటెండెంట్లు, ఫ్లైయింగ్ స్క్వాడ్స్, రూట్ ఆఫీసర్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, డిస్ట్రిక్ట్ ఆఫీసర్లు వారి వారికి కేటాయించిన విధులను సమయపాలన పాటిస్తూ, ఎలాంటి లోపాలు లేకుండా జాగ్రత్తగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ రాధికా గుప్తా అన్నారు. ప్రతి ఒక అంశం నియమ నిబంధనల ప్రకారం చేయాలని, మీకు కేటాయించినంత వరకు మాత్రమే మీరు మీ విధులను నిర్వహించాలని ఆమె సూచించారు. చీఫ్ సూపరిటెండెంట్లు పరీక్షా కేంద్రాలను పరిశీలించి అవసరమైన మౌలిక వసతులను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అందరితో సమన్వయం చేసుకుంటూ గ్రూప్-1 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలను సూచించారు. భద్రత పోలీసుశాఖ వారితో నిరంతరాయ విద్యుత్తు, త్రాగునీరు సంబంధిత శాఖల అధికారులతో కో-ఆర్డినేట్ చేసుకొని అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు ఒకరోజు ముందుగానే మీకు కేటాయించిన పరీక్షా కేంద్రాలను పరిశీలించుకోవాలన్నారు. పరీక్షా సెంటర్లలో రూట్ మ్యాప్‌లు, సైన్ బోర్డ్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్ వంటి వాటిని సరిగా ఉన్నాయా అని పరిశీలించాలి. ఈ పరీక్షలకు విధులు నిర్వహిస్తున్న అధికారులందరి మొబైల్ ఫోన్లను పరీక్షా కేంద్రాల్లోనికి అనుమతించడం జరగదని స్పష్టం చేశారు. సంబంధిత అధికారులు వారి నిర్ణీత సమయంలోగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. అధికారులకు అందించే డైరీ ప్రకారం టైమ్ టు టైమ్ సరైన విధంగా విధులు నిర్వహించాలని అన్నారు.

నగర సంప్రదాయం, కళల పునర్జీవం కోసమే ప్రజా సంబరాలు

ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి

బంజారాహిల్స్: జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఈ నెల 20న ప్రజా సంబరాలు పేరిట అద్భుతమైన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి తెలిపారు. కేబీఆర్ ప్రామెనేడ్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 20న ఆదివారం కేబీఆర్ పార్కు వద్ద మధ్యాహ్నం 12.30 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు ప్రజా సంబరాలు కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. హైదరాబాద్ నగర సంప్రదాయ, వారసత్వ సంపద సంరక్షణ, మరుగున పడిపోతున్న కళలకు పునర్జీవం పోయడం, ప్రాంతీయ కళాకారులు, ఔత్సాహికులను ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఇందులో భాగంగా వివిధ రకాలైన ఈవెంట్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కేబీఆర్ ప్రామెనేడ్‌లో ప్రజలు కుటుంబంతో సహా ఆస్వాదించేలా సాంస్కృతిక కార్యక్రమాలు, లైవ్ మ్యూజిక్, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్, ఫన్ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ప్రజాసంబరాలకు ఉచిత ప్రవేశం ఉందని, ఆర్ట్స్, పెయింటింగ్ పోటీల్లో పాల్గొనేవారు మాత్రం తప్పనిసరిగా తమ పేరు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. చిత్రకళ పోటీలకు సంబంధించి థీమ్ స్పాట్‌లో అక్కడే ఇవ్వబడుతుందని, చార్ట్ పేపర్, బోర్డు స్కెచ్‌లు ఏర్పాటు చేస్తారని, ఈ పోటీ ఉచితమని, పేర్కొన్నారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతి, సర్టిఫికెట్లు అందజేస్తారని, మరిన్ని వివరాలకు ఖైరతాబాద్ జోనల్, జూబ్లీహిల్స్ సర్కిల్ కార్యాలయాల్లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు. ఆర్ట్, పెయింటింగ్‌లో ఆసక్తిగలవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పెండింగ్ పనులను పూర్తి చేయాలి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



జోనల్ కమిషనర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గంలోని పార్కులు, గ్రేవ్‌యార్డులు, కమ్యూనిటీ హాల్స్ పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. మంగళవారం జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌ను కలిసి పెండింగ్ పనులపై మాట్లాడారు. అవసరమైతే నిధులను కూడా విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో డీఈ గోవర్ధన్, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కార్పొరేటర్



శుభాకాంక్షలు తెలుపుతున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్

ఆల్విన్‌కాలనీ: పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని మంగళవారం ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ శుభాకాంక్షలు తెలిపారు. శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, శివరాజ్‌గౌడ్, భాస్కర్‌రెడ్డి, కాశీనాథ్ యాదవ్ పాల్గొన్నారు.

మల్లికార్జునస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే

ఆల్విన్‌కాలనీ: పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ జన్మదినంను పురస్కరించుకొని మంగళవారం కొమురవెల్లి మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదం, స్వామివారి చిత్రపటాన్ని అందించి ఆశీర్వచనాలు అందజేశారు.

◆ ఎమ్మెల్యే గాంధీ మంగళవారం కొండగట్టు ఆంజనేయస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు స్వామివారి శేష వస్త్రాలు అందజేసి, ప్రసాదం, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కార్పొరేటర్‌లు రాగం నాగేందర్‌యాదవ్, దొడ్ల వెంకటేష్‌గౌడ్, నార్నే శ్రీనివాసరావు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్రముఖ దేవాలయాల దర్శనానికి డిసెంబర్ 5న ప్రత్యేక రైలు

కాచిగూడ: ఇండియన్ రైల్వేస్, భారత్ గౌరవ్ రైలు పథకం కింద మొట్టమొదటి ఏకైక ప్రైవేట్ సెక్టార్ సర్వీస్ ప్రొవైడర్ సౌత్ స్టార్ రైల్, టూర్ టైమ్స్ కర్ణాటకకు ప్రత్యేక రైలును ప్రకటించింది. ఈ సందర్భంగా మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సౌత్ స్టార్ రైల్ ప్రొడక్ట్ డైరెక్టర్ విగ్నేష్, టూర్ టైమ్స్ రీజినల్ డైరెక్టర్ రమేష్ అయ్యంగార్‌లు మాట్లాడుతూ కర్ణాటకలోని ప్రముఖ ఆలయాలను సందర్శించడానికి ఈ ప్రత్యేక రైలు అవకాశం కల్పిస్తుందని తెలిపారు. డిసెంబర్ 5న రైలు ప్రారంభమవుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి ప్రయాణికులు రైలు ఎక్కవచ్చునని తెలిపారు. 9 రోజుల వ్యవధిలో కర్ణాటకలోని అత్యంత ప్రముఖ దేవాలయాలైన నవ బృందావనం, గోకర్ణ, మురుడేశ్వర్, కొల్లూరు, శృంగేరి, హొరనాడు, ధర్మస్థల, మైసూర్, శ్రీరంగపట్నం, మేల్కోటేలను సందర్శించవచ్చునని తెలిపారు. ఈ యాత్రలో డిసెంబర్ 9న సోమవారం ధర్మస్థల మంజునాథ స్వామి దర్శనం, డిసెంబర్ 10న మంగళవారం కుక్కే సుబ్రమణ్యస్వామి దర్శనం, సర్పదోషం, కుజ దోషం పూజచేసే అవకాశం ఈ యాత్రలో పాల్గొన్న వారికి ఉంటుందన్నారు. గోకర్ణలోని నక్షత్రం, తిథితో సంబంధం లేకుండా పిండ తర్పణం చేసి మన పూర్వీకుల ఆశీస్సులు పొందే అవకాశం ఉంటుందన్నారు. గమ్యస్థానాలు, మార్గాల గురించి సమాచారం కోసం పబ్లిక్ అనౌన్స్‌మెంట్ సిస్టమ్‌లు, సీసీ టీవీ కెమెరాలు, ప్రతి కోచ్‌కు టూర్ మేనేజర్ తదితర రకాల సౌకర్యాలు ఉన్నాయని తెలిపారు. గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, గుంటూరు, నల్గొండ, మిర్యాలగూడ, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లలో రైలు ఎక్కేందుకు యాత్రికులకు అవకాశం ఉందన్నారు. సీనియర్ సిటిజన్లకు ఇది ఒక చక్కటి అవకాశమన్నారు. యాత్రకు సంబంధించి టికెట్ బుకింగ్ ప్రారంభమైందని తెలిపారు. వివరాలకు 9335021516 నంబర్‌ను సంప్రదించవచ్చన్నారు.

ఏడుపాయలలో అమ్మవారి విగ్రహం నిమజ్జనం



మూసాపేట: మూసాపేట చిత్తారమ్మ తల్లి ఆలయం వద్ద మహావీర్ భక్త మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహాన్ని మంగళవారం ఏడుపాయలలో నిమజ్జనం చేశారు. ఏడుపాయలలోని వనదుర్గాదేవి ఆలయంలో నిర్వాహకులు గాజుల మహేష్ గౌడ్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.

భారీ వర్షం.. విరిగిన స్తంభం



నిజాంపేట్: ఈదురుగాలులతో కురిసిన భారీ వర్షానికి విద్యుత్ స్తంభం నేలకొరిగింది. నిజాంపేట్ కార్పొరేషన్ 24వ డివిజన్‌లో సోమవారం సాయంత్రం కురిసిన వర్షానికి చెట్లకొమ్మలు విద్యుత్ స్తంభంపై విరిగి పడ్డాయి. ఈ ఘటనలో స్తంభం సగానికి విరిగింది. స్థానికులు వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో సరఫరాను నిలిపివేశారు. అయితే విరిగిన స్తంభాన్ని తొలగించకపోవడంతో రాకపోకలకు స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.